ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల జిల్లా వార్తలు

5★★★

గురువారం 20 ఫిబ్రవరి 2025

చంద్రంపేటలో లోపించిన పారిశుధ్యం

- రోడ్డుపై పారుతున్న మురుగునీరు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

8

ఘనంగా శివాజీ జయంతి వేడుకలు

న్యూస్ బాక్స్

పౌష్టికాహారం అందించాలి

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆటపాటల విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాల, హరిదాస్‌నగర్, రాగట్లపల్లి, అల్మాస్‌పూర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించారు. కేంద్రాల్లో నిల్వ ఉన్న పౌష్టికాహారం పరిశీలించారు. చిన్నారులు, గర్భిణీలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలన్నారు. వెంట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి, అంగన్‌వాడీటీచర్లు ఉన్నారు.

అయోడిన్‌పై అవగాహన..

గంభీరావుపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండల కేంద్రంలో ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా, ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్మెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక అంగన్వాడీ సెంటర్‌లో అయోడిన్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ సంగీత, అంగన్వాడీ టీచర్ మమత తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ యార్డు నిర్మాణానికి స్థల పరిశీలన

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మార్కెట్ యార్డు నిర్మాణానికి అధికారులు, స్థానిక నాయకులు బుధవారం స్థల పరిశీలన చేశారు. మండల కేంద్రంలోని గిద్దచెరువు సమీపంలో మార్కెట్ యార్డు నిర్మాణానికి అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. ఏఎంసి చైర్ పర్సన్ సబేరా బేగం, ఎంపీవో రాజు, మార్కెట్ కమిటీ కార్యదర్శి హరీష్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, నాయకులు నరసయ్య, రామ్‌రెడ్డి, బాబు తదితరులు ఉన్నారు.



'ట్రస్టుబోర్డు' కోసం ఎదురుచూపులు

- వేములవాడ దేవస్థానం ట్రస్ట్ బోర్డు పదవులపై ఆశలు
- 12 ఏళ్లుగా ఉత్సవ కమిటీతోనే వేడుకలు
- మరో ఐదు రోజుల్లో మహా శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- గత సంవత్సరం ఉత్సవ కమిటీకే పరిమితం..
- ఈసారి ఆరు నెలలు ఉండే విధంగా కమిటీ ఏర్పాటుకు సన్నాహాలు
- 1963 నుంచి రాజన్న క్షేత్రంలో పాలకవర్గాల ఏర్పాటు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో ట్రస్ట్‌బోర్డు లేకపోవడంతో ఆలనాపాలనా వ్యవహారంలో నిబద్ధత, పారదర్శకత లోపించిందనే విమర్శలు ఉన్నాయి. మరో ఐదు రోజుల్లో వేములవాడ రాజన్న మహాశివరాత్రి జాతర వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఈనెల 25 నుంచి 27 వరకు వేడుకలు నిర్వహించే విధంగా అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. గత సంవత్సరం వేడుకలకు ఉత్సవ కమిటీ సభ్యులుగా అనుముల చంద్రయ్య, వడ్డెపల్లి వెంకటరమణ, రాజిరెడ్డి, విజయలక్ష్మీ, సాగరం వెంకటస్వామి, పాత సత్యలక్ష్మీ, కూరగాయల కొమురయ్య, చంద్రగిరి శ్రీనివాస్, కనికరం రాకేష్, నాంపల్లి శ్రీనివాస్, పులి రాంబాబు, తూము సంతోష్, వకుళాభరణం శ్రీనివాస్, పిల్లి శ్రీనివాస్, సంగె స్వామి జగన్మోహన్‌రెడ్డి, చేపూరి గంగయ్య, చింతపంటి రామస్వామి, కాయితీ నాగరాజు, అంజయ్య, ఎనుగు రమేష్‌రెడ్డి, సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, మల్లేశంలతో కమిటీ వేశారు. ఈసారి వేడుకలకు ఉత్సవ కమిటీ వేస్తారా లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మరోవైపు దేవస్థానం రినోవేషన్ కమిటీ పేరుతో ఆరు నెలల పాటు సభ్యులు ఉండే విధంగా కమిటీ వేస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ దిశగానే సన్నాహాలు చేస్తున్నారని తెలుస్తోంది. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆలయ అభివృద్ధిపై దృష్టి పెట్టారు. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని వేములవాడకు తీసుకవచ్చి రూ.127 కోట్ల పనులకు శ్రీకారం చుట్టారు. కానీ 12 ఏళ్లుగా ట్రస్ట్‌బోర్డు లేకపోవడంతో దేవస్థానంలో అనేక విభాగాల్లో నిర్లక్ష్యమే కనిపిస్తుందనే..

మిగతా 8లో

వేములవాడ దేవస్థానంలో ఇప్పటివరకు ఉన్న చైర్మన్లు

చైర్మన్	కాలపరిమితి
సీహెచ్ వెంకటేశ్వర్‌రావు	1963 - 1977
ఎం కొండల్‌రావు	1977 - 1980
సీహెచ్ వెంకటేశ్వర్‌రావు	1981 - 1984
ఉచ్చిడి మోహన్‌రెడ్డి	1984 - 1987
దుగ్గిరాల వెంకట్రావు	1988 - 1990
ఉచ్చిడి మోహన్‌రెడ్డి	1992 - 1994
సీహెచ్ కమలాకర్‌రావు	1994 - 1996
శికారి విశ్వనాథం	1998 - 1999
శికారి విశ్వనాథం	2002 - 2004
ఆది శ్రీనివాస్	2004 - 2006
ఆది శ్రీనివాస్	2007 - 2009
బొమ్మ వెంకన్న	2009 - 2013

సిరిసిల్ల పట్టణం స్వచ్ఛదనం, పచ్చదనంతో ఉండాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



సంజీవయ్య విగ్రహం వద్ద మురుగు కాలువను పరిశీలిస్తున్న కలెక్టర్

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణం నిత్యం స్వచ్ఛదనం పచ్చదనంతో ఉండాలని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలోని కొత్త చెరువు, పాత బస్టాండ్, సంజీవయ్యనగర్, పద్మనగర్, వెంకంపేట, కార్గిల్‌లేక్, కొత్త బస్టాండ్, రైతుబజార్, బైపాస్ రహదారులు, బతుకమ్మ ఘాట్ ప్రాంతాలను క్షేత్ర స్థాయిలో జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. సిరిసిల్ల ప్రధాన రహదారుల మధ్యలోని డివైడర్లకు కావాల్సిన మరమ్మత్తులు, మొక్కలు పెంపకం చేపట్టాలని ఆదేశించారు. పట్టణంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి అన్ని ప్రధానరహదారులతో పాటు కొత్త చెరువు పరిసరాలు శుభ్రం చేయించాలన్నారు. విద్యుత్, నీటి సరఫరా పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెరువు వద్ద ఉన్న దుకాణాలన పరిశీలించాలని కొత్త చెరువులోకి వరదనీరు వెళ్లేందుకు పనుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. స్థానికంగా సంజీవయ్య జంక్షన్ అభివృద్ధికి డీపీఆర్ తయారుచేయాలని పట్టణంలో ఏర్పాటు చేసిన హోర్డింగ్స్ అడ్వర్టైజ్మెంట్ పన్ను చెల్లించారా లేదో పరిశీలించాలని, పన్నులు చెల్లించని వాటిని తొలగించాలని ఆదేశించారు. పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో మురుగు కాలువలను శుభ్రం చేయాలని సూచించారు. వెంట మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఏఈ స్వామి, సిబ్బంది ఉన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలి

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికి వ్యాధి నిరోధక టీకాలను వేసి వెంటనే రెండు గంటల వరకు తల్లితో పాటు పిల్లలను పరిశీలనలో ఉంచాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత కోరారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేట, చిన్నబోనాల గ్రామాల్లోని ఆరోగ్య ఉప కేంద్రాల్లో జరుగుతున్న టీకా వేసే కార్యక్రమాలను బుధవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా రజిత మాట్లాడుతూ తొలిసారిగా ఇచ్చే వ్యాక్సినేషన్ గురించి తల్లిదండ్రులతోపాటు బాలింతలకు సమాచారాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వేములవాడలో పోలీసుల కవాతు

వేములవాడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలో బుధవారం పోలీసులు కవాతు నిర్వహించారు. పట్టణ సీఐ వీరప్రసాద్ నేతృత్వంలో పోలీసులు కోరుట్ల బస్టాండ్ నుంచి రాజన్న ఆలయం వరకు కవాతు లో పాల్గొన్నారు. శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళి అమలుతో పాటు రాజన్న సన్నిధిలో జరిగే మహాశివరాత్రి జాతర సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ కవాతు నిర్వహించామని ఈ సందర్భంగా సీఐ వీర ప్రసాద్ తెలిపారు. ఎస్సైలు రమేష్, ప్రేమానందం, వెంకట్‌రాజం, రాజు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తాగునీటి కోసం మహిళల ఆందోళన

వీర్నపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : తాగునీటి నీళ్ల కోసం మహిళలు రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని ఎల్లమ్మగుడి ఏరియా సుభాష్‌నగర్ కాలనీ వాసులకు నెలరోజులుగా తాగునీరు సరిగా రావడం లేదని ఆరోపించారు. రహదారి పనుల్లో మంచినీటి పైపులైన్ ధ్వంసమై నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నా సరిపోవడం లేదన్నారు. త్వరలోనే సమస్యను పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు.

ధర్నాను విజయవంతం చేయాలి

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని ఈనెల 24న పాలిస్టర్ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘ భవనం ఎదుట కార్మికులతో చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్‌లోని భవాని ఫంక్షన్ హాల్‌లో బుధవారం మరమగ్గాల కార్మికులతో జరిగిన సమావేశంలో నెహ్రూనగర్, వెంకట్రావునగర్ ఏరియాలకు సంబంధించి నూతన కమిటీని ఎన్నుకోవడంతోపాటు ఈనెల 24న చేపట్టే ధర్నాపై చర్చించారు.

నెహ్రూనగర్ కమిటీ ఎన్నిక

పట్టణంలోని నెహ్రూనగర్ ఏరియా సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ వార్డు గౌరవ అధ్యక్షుడిగా సందుపట్ల రామచంద్రం, అధ్యక్షుడిగా బెజుగం సురేష్, కార్యదర్శిగా స్వర్గం చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా అన్నల్‌దాస్ రాములు, మేర్గ నరేష్, సహాయ కార్యదర్శులుగా సబ్బని కృష్ణ, కళ్యాణపు మహేందర్, కమిటి సభ్యులుగా మ్యాన శ్రీనివాస్, కూరపాటి రాజు, కోమాకుల సురేష్, ఎండి అంకుష్‌లను ఏకగ్రీవం ఎన్నుకున్నారు. ఈ సమావేశాలల్లో జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, జిల్లా నాయకులు జిందం కమలాకర్ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా నియామకమైన రెడ్డబోయిన గోపి ముదిరాజ్ బుధవారం కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను ఆయన నివాసంలో నాయకులతో మార్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలను స్వీకరించి పార్టీని మరింత బలోపేతం చేయాలని కేంద్ర మంత్రి సూచించడంతోపాటు సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

చందుర్తి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవంను బుధవారం కన్నుల పండుగగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో వేద పండితులు వేద మంత్రోచ్చారణల మధ్య కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఆలయ కమిటీ శాశ్వత చైర్మన్ జేపి రావులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ చెల్కల తిరుపతి, సింగిల్‌విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ నాగం కుమార్, పొద్దుపొడుపు లింగారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు జువ్వాడి అనిల్‌రావు, నక్క తిరుపతి బాబు, లక్ష్మన్, రవి, శ్రీనివాస్, మోహన్, అనంతరెడ్డి, నరేష్, అనిల్, హన్మండ్లు, భాస్కర్‌రెడ్డి, నారాయణ, నాయకులు చింతపంటి రామస్వామి, దర్మపురి శ్రీనివాస్, దుమ్మ అంజయ్య, చిలుక పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

మరిమడ్లలో పెద్దమ్మ బోనాలు

కోనరావుపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మరిమడ్లలో బుధవారం పెద్దమ్మ బోనాల పండుగ ఘనంగా జరిగింది. ముదిరాజుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పెద్దమ్మ తల్లికి ఊరేగింపుగా డప్పుచప్పుళ్ల మధ్య బోనాలతో వెళ్లి అమ్మవారికి నైవేద్యం పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ముదిరాజ్ సంఘం నాయకులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు కుమ్మరి దిలీప్, పుల్కం మల్లేశం, రాజేందర్, దేవ నర్సయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు. కాగా, మరిమడ్ల గ్రామంలో పెద్దమ్మ-పెద్దిరాజుల కళ్యాణ మహోత్సవంలో బుధవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కల్యాణంలో కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, జింక శ్రీనివాస్, కుమ్మరి దిలీప్, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

దవాఖానా ఆవరణలో చెత్త తొలగింపు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

వీర్నపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండల కేంద్రంలోని పల్లె దవాఖానా ఆవరణలో గ్రామపంచాయతీ సిబ్బంది చెత్తను తొలగించి పరిశుభ్రంగా చేశారు. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన పల్లె దవాఖానా ఆవరణలో పారిశుధ్య లోపం అనే కథనానికి ఎంపీడీవో అబ్దుల్ వాజీద్ స్పందించారు. దవాఖానా చుట్టూ ఉన్న కవర్లు, మురికి నీటిని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. పల్లె దవాఖానా పరిసరాలు పరిశుభ్రం చేయడం పట్ల అక్కడికి వచ్చే ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

గిరిజనులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా గిరిజనులపై పెట్టిన పోడు భూముల కేసులను కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఎత్తివేయాలని లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర ఇన్‌చార్జి బానోతు నరేష్‌నాయక్ అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి లంబాడీల ఐక్య వేదిక నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరేష్‌నాయక్ విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయంలో పోడు వ్యవసాయం చేసుకుంటున్నటువంటి గిరిజన రైతులపై దాదాపు ఐదు వేలకు పైగా అక్రమంగా పోడు భూములు కేసులు నమోదు చేశారని ఆరోపించారు. కేసులతో కోర్టుల చుట్టు తిరగలేక గిరిజన రైతులు అనేక ఆర్థిక ఇబ్బందుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేస్తామని హామీ నిచ్చిందని వెంటనే కేసులను ఎత్తి వేయాలని విజ్ఞప్తి చేశారు గిరిజనుల సమస్యలపై పోరాటాలు చేసిన తమపై కూడా పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగాధర్, మంగనాయక్, నరస్‌నాయక్, జ్యోతిబాయి, అమృతబాయి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమీక్ష నిర్వహించారు. టార్పాలిన్ కవర్లు, మరోసారి వినియోగించేందుకు అవకాశాలను పరిశీలించాలని, అవసరమైన వసతుల కల్పనపై పక్కాగా ప్రణాళిక ఉండాలన్నారు. టార్పాలిన్ కవర్లు, గన్నీ బ్యాగులు, వేయింగ్ యంత్రాలు, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉన్నవాటిపై నివేదిక అందించాలన్నారు. యాసంగి వరికోతలకు ముందే హార్వేస్టర్ల యజమానులతో సమా వేశం నిర్వహించి ప్రణాళిక తయారు చేయాలని అవసరమైన జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని వసతులతో పకడ్బందీగా కార్యాచరణ తయారుచేయాలని అన్నారు. జిల్లాలో మిల్లర్లు బిల్డింగ్ కేపాసిటీ పెంచాలని మిల్లింగ్ సామర్థ్యం మేరకు జరగాలన్నారు. నిర్దేశిత సమయంలో ఎఫ్‌సీఐకు సరఫరా పూర్తి చేయాలని ప్రతిరోజు కనీసం 16 గంటల వరకు మిల్లింగ్ జరిగేలా చూడాలని అన్నారు. రైస్‌మిల్లర్ల వద్ద ఉన్న స్టాక్‌ను తనిఖీ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల అధికారి వసంతలక్ష్మీ, మేనేజర్ రజిత, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి : ఎస్పీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

గంభీరావుపేట ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేగ పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఎస్పీ అఖిల్ మహాజన్ తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను, స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న, నమోదైన కేసుల వివారలు, స్టేషన్ రికార్డులు తనిఖీ చేశారు. కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు అలసత్వం వహించవద్దని, ప్రజాఫిర్యాదులపై జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలన్నారు. ప్రజలకు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని సూచించారు.బ్లూ కోల్ట్స్,పెట్రో కార్ సిబ్బంది 100డయల్ కాల్స్‌కు తక్షణమే స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. పెట్రోలింగ్ సమయంలో పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లను ప్రతి రోజు తనిఖీ చేయాలని, స్టేషన్ పరిధిలో సీసీటీవీల ఏర్పాటుపై దృష్టి సారించి సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు అయిన గంజాయి, అక్రమ ఇసుక రవాణా, పీడీఎస్ రైస్ అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని, గంజాయి కిట్ల సహాయంతో యూరిన్ టెస్టులు నిర్వహించి గంజాయి తాగే వారిని, వారికి సరఫరా చేసే వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఎస్పీ వెంట సీఐ శ్రీనివాస్, ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.

'ప్రజలను రెచ్చగొడుతున్న బీఆర్ఎస్ నాయకులు'

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, నాయకులు ప్రజలను రెచ్చగొడుతున్నారని కాంగ్రెస్ పార్టీ చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిని తిట్టడం తప్ప నిజాలు చెప్పడం లేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల బకాయిలు రూ.222 కోట్లు బకాయిలు పెట్టిపోతే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆ బకాయిలను చెల్లించింది జౌళిశాఖ కార్యాలయం వెళ్లి బీఆర్ఎస్ నాయకులు తెలుసుకొని మాట్లాడాలన్నారు. సిరిసిల్ల జిల్లా అయినప్పుడు అభివృద్ధి జరుగుతుందని కలెక్టర్ కార్యాలయంతోపాటు కళాశాలలు రావడం అభివృద్ధిలో భాగం అని ఇందులో మీరు చేసిన ఘనకార్యం ఏం లేదన్నారు. మీరు చేసిన ఘనకార్యం సిరిసిల్ల వాగులో ఇసుక లేకుండా చేయడం అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడికి దోచుకోమని బాపు కేసీఆర్ ఇద్దరు ఘన్‌మెన్ ఇస్తే 25 ఎకరాల భూమిని దోచుకున్నాడని ఆరోపించారు. ప్రజలను రెచ్చగొట్టే మాటలు మాట్లాడడం సరికాదన్నారు. నియోజకవర్గంలో ఎంపీపీలు, జడ్పిటీసీలు, ఎంపిటీసీలను కేకే మహేందర్‌రెడ్డి గెలిపించుకుంటే 2009లో ఆయనకు వెన్నుపోటు పొడిచి ఉద్యమంలో లేని కేటీఆర్‌ను తీసుకొచ్చింది మీరు కాదా కేకే మహేందర్‌రెడ్డి తినే బుక్కను లాక్కున్నది మీరు కాదా అని ప్రశ్నించారు. నిజాలు మాట్లాడాండి ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావలని సూచించారు.

ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మాజీ కౌన్సిలర్లు వేముల రవి, కుడికాల రవికుమార్,నాయకులు వెల్ముల తిరుపతి రెడ్డి, కామిని నళినీకాంత్, బొద్దుల శ్రీను, పిస్క మధు, కోడం అమర్నాథ్, వంగరి దత్తు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి..

- బేడ, బుడగ జంగం- జన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేణు



సమావేశంలో మాట్లాడుతున్న వేణు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో అంబేద్కర్ అభయ హస్తంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి లేని పక్షంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడతామని బేడ, బుడగ జంగం-జనసంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిరిపాటి వేణు అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం దాదాపు 30 సంవత్సరాల పాటు అలుపెరగని పోరాటం చేసిన మంద కృష్ణ మాదిగకు సంఘం పక్షాన, ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చినందుకు, ఎస్సీ వర్గీకరణకు సానుకూలంగా స్పందించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు తెలిపారు. వర్గీకరణనను మూడు విభాగాలుగా రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని గ్రూప్-1లో సంచార జాతితో పాటు అన్ని రంగాలలో వెనకబడిన 13 కులాలతో పాటు అన్ని రంగాలలో ముందు వరసలో ఉన్న రెండు కులాలను చేర్చడం జరిగిందని మన్నె, పంబాల కులాలను తొలగించి వెనకబడిన కులాలను చేర్చాలన్నారు. తమ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కెనాల్‌లో పడి సింగరేణి రిటైర్డు కార్మికుడి మృతి

మంథని, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోచమ్మవాడ సమీపంలోని ఎస్‌ఆర్‌ఎస్‌పీ కెనాల్‌లో ప్రమాదవశాత్తు పడి సింగరేణి రిటైర్డు కార్మికుడు తిప్పనిశంకరయ్య(80) మృతిచెందాడు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌కాలనీకి చెందిన శంకరయ్య ఈనెల5న స్వగ్రామమైన ఓదెలకు వెళుతున్నట్లు భార్య మల్లమ్మకు చెప్పి బయలుదేరాడు. ఓదెలకు చేరుకోకపోవడం, ఫోన్ పనిచేయకపోడంతో ఈనెల6న శంకరయ్య కొడుకు తిప్పనిలక్ష్మణ్ నస్పూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బుధవారం ఉదయం కెనాల్‌లో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు స్థానికులు100కు డయల్ చేశారన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్ళి మృతదేహానికి పరిశీలించారన్నారు. శ్రీరాంపూర్‌లో మిస్సింగ్ కేసు నమోదు కాగా శంకరయ్య బంధువులను మంథనికి పిలిపించగా మృతదేహాన్ని పరిశీలించి శంకరయ్యగా గుర్తించారన్నారని ఎస్‌ఐ రమేష్ తెలిపారు. శంకరయ్య మద్యం సేవించి మతి స్థిమితం లేకుండా తిరుగుతాడని, ఈనేపథ్యంలో మండలంలోని ధర్మారం గ్రామంలో బంధువులు ఉండటంతో ఇక్కడి వచ్చి మద్యం సేవించి ప్రమాదవశాత్తు కెనాల్‌లో పడి మృతి చెంది ఉంటాడని తెలిపారు. మృతుడి కొడుకు లక్ష్మన్ ఫిర్యాదు చేయగా ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..

వీణవంక, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన అంబాల వీరమ్మ(91) చలిమంట కాగుతూ చీరకు మంటలంటుకోగా చికిత్సపొందూ మృతిచెందింది. పోలీసులు వివరాల ప్రకారం.. ఈనెల12వతేదీన ఉదయం ఇంటిముందు చలి మంటకాగుతుంగా ప్రమాదవశాత్తు వీరమ్మ చీరకు నిప్పంటుకుంది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే కరీంనగర్ ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తోట తిరుపతి తెలిపారు.

అతిగా మద్యం తాగి యువకుడు..

ధర్మపురి, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని పెద్దనక్కలపేట గ్రామానికి చెందిన బండారి భూమేష్(32) అనే యువకుడు అతిగా మద్యంసేవించి మృతిచెందినట్లు ఎస్‌ఐ ఉదయ్ కుమార్ తెలిపారు. బండారి లక్ష్మి అనే మహిళకు కొడుకు, ముగ్గురు కూతుళ్ల ఉండగా కొడుకు భూమేష్ అతిగా మద్యం సేవిస్తుంటాడని తెలిపారు. లక్ష్మి బీర్‌పూర్ జాతరకు వెళ్లి బుధవారం వచ్చి చూసేసరికి కొడుకు భూమేష్ మంచంపై చనిపోయి ఉన్నాడని ఆయన పేర్కొన్నాడు. భూమేష్ అతిగా మద్యం సేవించి తిండి సరిగా తినకపోవడం వల్ల మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఉరివేసుకుని మాజీ జడ్పీటీసీ ఆత్మహత్య


రాజమల్లు (ఫైల్)

వీణవంక, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మాజీ జడ్పీటీసీ ఆనంద రాజమల్లు(72) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థుల కథనం ప్రకారం.. రాజమల్లు కొంతకాలంగా ఆర్థికఇబ్బందులతో బాధపడుతున్నాడు. బుధవారం ఎవరూలేని సమయంలో ఇంట్లో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు. 1997లో టీడీపీ తరపున జడ్పీటీసీగా ఎన్నికయ్యారు. మాజీ మంత్రి ముద్దసాని దామోదర్‌రెడ్డి ముఖ్య అనుచరుడిగా కొనసాగారు.

ఉరివేసుకుని యువకుడు..

ఎలిగేడు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సాపూర్ గ్రామానికిచెందిన యాదగిరి చందు(27)అనే యువకుడు బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎంబీఏ వరకు చదువుకున్న చందు ఏమి పని చేయకుండ ఇంటివద్దనే రెండేళ్లుగా ఉంటున్నాడు. ఏదైన పని చూసుకొమ్మని తరచుగా తల్లిదండ్రులు చెప్పేవారు. ఈక్రమంలో ఫోన్‌లో పరిచయమైన అమ్మాయిని ఎలా పెళ్లి చేసుకుంటావని మందలించారు. అటు ఉద్యోగంలేక ఇటు అమ్మాయిని పెళ్లి చేసుకోలేక ఖాళీగా ఉంటున్నాననే మనస్థాపంతో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు.

అత్యాచారం కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలు

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బాలిక (మానసిక వికలాంగురాలు)పై అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు వెయ్యి రూపాయలు జరిమానా విధించడంతో పాటు బాధితురాలికి రూ.2లక్షల పరిహారం చెల్లించాలని జిల్లా ప్రధానన్యాయమూర్తి నీలిమ బుధవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం మల్యాల పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన ఓబాలికపై 2021సంవత్సరంలో చెట్‌పెల్లి నారాయణ అలియాస్ టోపి నారాయణ(55) అనేవ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మల్యాల పోలీసులు నారాయణపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ రమణమూర్తి ఆధ్వర్యంలో కేసు విచారణ చేపట్టగా కోర్టు డ్యూటి అధికారులు సరైన సాక్ష్యులను ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టులో ప్రవేశ పెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణా రావుతో పాటు పోలీస్, కోర్టు డ్యూటీ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

భార్య, ఇద్దరు పిల్లల మృతికి కారణమైన భర్త రిమాండ్

పెగడపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): భార్య, ఇద్దరు పిల్లల మృతికి కారణమైన మద్దులపల్లి గ్రామానికిచెందిన కంబాల తిరుపతిని బుధవారం పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెగడపల్లి మండలంలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన కంబాల తిరుపతి వేరొక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని తన భార్య హారికను వేధింపులకు గురి చేశాడు. దీంతో హారిక పిల్లలకు పురుగుల మందు ఇచ్చి ఆమె కూడా తాగి మృతి చెందింది. ముగ్గురి మృతికి కారణమైన తిరుపతిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ సీహెచ్ రవికిరణ్ తెలిపారు.

సెల్‌ఫోన్ హ్యాక్‌పై సైబర్‌క్రైంకు ఫిర్యాదు

మంథని, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నఓదాల గ్రామానికి చెందిన చిట్టవేన హరీష్ సెల్‌ఫోన్ హ్యాక్ కాగా మంథని పోలీసులతో పాటు సైబర్ క్రైం పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. మంథనికి వచ్చిన అతనుఫోన్‌లో వాట్సాప్ ఓపెన్ చేయడంతో చాలా మందికి అతడి వాట్సప్ ద్వారా అశ్లీల చిత్రాలు వెళ్ళాయి. వారు ఫోన్‌చేసి ఈవిషయాన్ని చెప్పడంతో తన ఫోన్ హ్యాక్ అయినట్లు ఆందోళనకు గురై పోలీసుస్టేషన్‌కు వెళ్ళి ఫిర్యాదు చేశాడు. వారి సూచనమేరకు సైబర్ క్రైం 1930 నెంబర్ ద్వారా ఫిర్యాదు చేసి తన సిమ్ బ్లాక్ చేసినట్లు తెలిపారు.

దొంగల పట్టివేత

ధర్మపురి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో చిల్లర సామాన్లు దొంగతనం చేసిన ఐదురుగు మహిళలను స్థానికులు బుధవారం పట్టుకున్నారు. చొప్పదండి మండలానికి చెందిన ఐదుగురు మహిళలు గ్రామాల్లో చెత్త సామాన్లు, కాగితాలు సేకరించి బయట విక్రయిస్తుంటారు. అదే సమయంలో తిమ్మాపూర్ గ్రామంలోని పలు ఇళ్లలో చొరబడి స్టీల్, ఇత్తడి బిందెలు, ప్లేట్స్, చెంబులు, గ్లాసులు దొంగిలించారు. వెంటనే గ్రామస్థులు సదరు మహిళలను పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

ఆల్‌రౌండర్ అనిల్

సింగర్‌గా, డైరెక్టర్‌గా, యాక్టర్‌గా, రైటర్‌గా రాణిస్తున్న కథలాపూర్ యువకుడు

పదేళ్లుగా యూట్యూబ్‌లో సందడి

60 వేల మంది సబ్‌స్క్రైబర్లు


పాట పాడుతున్న అనిల్ పల్ల

కథలాపూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : పల్లెల్లో పరుచుకున్న అందాలు.. గ్రామీణ యువత మనసులోని మధురానుభూతులు..ఆధ్యాత్మిక భావాలను పెంపొందించే పదాలే ఆ యువకుడి కథా వస్తువులు. కథలాపూర్ మండలం దూలూరుకు చెందిన అనిల్ పల్ల అనే యువకుడు సింగర్‌గా, డైరెక్టర్‌గా, యాక్టర్‌గా, రైటర్‌గా రాణిస్తున్నాడు. పదేళ్లుగా అతడి పాటలు యూట్యూబ్‌లో సందడి చేస్తున్నాయి. సమ్మక్క- సారలమ్మ, బతుకమ్మ పండగ ప్రాశస్త్యాన్ని పాటలుగా రాయడమే కాకుండా కెమెరాలో బంధించి 60 వేల మంది సబ్‌స్క్రైబర్లను సంపాదించాడు.



అనిల్ నటించి, దర్శకత్వం వహిస్తున్న ఆల్బం

సీఎస్ క్రియేషన్స్ ఫిల్మ్ ప్రొడక్షన్ ఏర్పాటు

2015లో సీఎస్ క్రియేషన్స్ ఫిల్మ్ ప్రొడక్షన్ సంస్థను స్థాపించిన అనిల్ సొంతంగా పాట రాసి స్వీయ దర్శకత్వంలో వీడియో చిత్రీకరించి రైతు పాట పేరిట మొదటిసారిగా యూట్యూబ్ లో అప్‌లోడ్ చేశాడు. దీంతో అనేక మంది ఆ పాటను అభినందించారు. సుడా సక్కని పిలగా, మనసులో తెరచాటుగా, సిననిన సింతల్లారా, బతుకమ్మ, సమ్మక్క, సారలక్క, వానల్లో వరదల్లో చినుకుల్లో వంటి జానపద పాటలను నటీనటులతో కలిసి వీడియోలు రూపొందించాడు. పల్లెటూరు యువతలో దాగి ఉన్న కళను బయటకు తీసే ప్రయత్నం చేశాడు.

భజరంగ్ మూవీ మేకర్స్‌తో సినిమాలు

వీడియో పాటలకు వెల్లువలా వస్తు న్న కామెంట్లతో తన ప్రతిభకు మరింత పదును పెట్టాలనే యోచనతో భజరంగ్ మూవీ మేకర్స్ పేరిట సినిమాలు తీయాలని సంకల్పించాడు. అరాచకం, మరిచి పోతున్న కన్నయ్యా అనే సినిమాలు పోస్ట్ ప్రొడక్షన్‌లో ఉన్నాయి.

బాల్యం నుంచి పాటలంటే ఇష్టం

అనిల్ పల్ల, కళాకారుడు

పల్లె ప్రజల జీవన శైలి నేపథ్యంతోనే పాటలు రాయాలని చిన్ననాటి నుంచి ఆసక్తి ఉండేది. భీమారం మండలం ఈదుల లింగంపేట పాఠశాలలో చదువుకునే రోజుల్లో నేను పాడిన పాట విని గురువులు అభినందించారు. జిల్లాస్థాయి పాటల పోటీల్లో గెలుపొంది వేములవాడలోని సినారే కళాభవన్‌లో సినారే చేతుల మీదుగా బహుమతి పొందడం నాలో మరింత ఆసక్తిని పెంచింది. ప్రస్తుతం కథలాపూర్‌లో స్టూడియో ఏర్పాటు చేసుకొని పాటలు రాస్తూ, గానం చేస్తూ, దర్శకత్వం, డబ్బింగ్, కాస్ట్యూమ్, ఎడిటింగ్ వంటి పనులన్నీ చేసుకుంటున్నా. యూట్యూబ్‌లో 60 వేల మంది సబ్‌స్క్రైబర్లు ఉండడం చాలా సంతోషంగా ఉంది.

మైసమ్మ ఆలయంలో చోరీ..

ముస్తాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) :ముస్తాబాద్ మండలకేంద్రంలోని పులి శేరుకుంట కట్టపైగల మైసమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి జరిగిందని ఆలయ కమిటీచైర్మన్ బద్దిపడిగె ప్రతాపరెడ్డి తెలిపారు. ఆలయంలో ఏర్పాటు చేసిన రూ12 వేలవిలువచేసే గంటతో పాటు హుండీలోని డబ్బులను దొంగలు దొంగిలించారన్నారు. గతంలో సైతం ఇలాగే చోరీ జరిగిందని వాపోయారు. స్థానిక పోలీసుకు ఫిర్యాదు చేస్తున్నట్లు ప్రతాపరెడ్డి, పుల్లూరి రవిలు వివరించారు.

పేకాట కేంద్రంపై పోలీసుల దాడి

ఓదెల, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారు హరిపురం రోడ్డు వైపు బుధవారం పోలీసులు పేకాటకేంద్రంపై దాడిచేశారు. ఎస్సై రమేష్ మాట్లాడుతూ ఓదెలకు చెందిన కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లిదాడి చేశామని తెలిపారు. తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.రూ.7,100, మూడు సెల్‌ఫోన్లు, నాలుగు ద్విచక్రవాహనాలు స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో పేకాటలు, కోడిపందేలు, బెట్టింగులు లాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. కానిస్టేబుళ్ళు రాజేందర్, ప్రశాంత్, రామకృష్ణ పాల్గొన్నారు. తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు పొత్కపల్లి ఎస్సై దీకొండ రమేష్ తెలిపారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

● 103 గ్రాములు బంగారం స్వాధీనం


నిందితుడి అరెస్ట్ చూపుతున్న మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పలు జిల్లాల్లో చోరీలకు పాల్పడుతున్న ఘరానా దొంగ మిట్టపల్లి లక్ష్మణ్ అలియాస్ రవి అలియాస్ విజయ్‌ని మల్లాపూర్ మండలం ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీ వద్ద అరెస్ట్‌చేశారు. మెట్‌పల్లి సీఐ నిరంజన్ రెడ్డి బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్బంగా సీఐ మాట్లాడుతూ నిర్మల్ జిల్లా భైంసా పట్టణానికి చెందిన మిట్టపల్లి లక్ష్మణ్ కొద్ది సంవత్సరాలుగా ఉమ్మడికరీంనగర్, నిజామాబాద్, మహబూబ్ నగర్ జిల్లాల్లో తాళం వేసిన ఇళ్లను గుర్తించి బంగారం, వెండి ఆభరణాలను దొంగిలించేవాడని అన్నారు. నిందితుడిపై 40కేసులు ఉండగా 28కేసులు కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 12 కేసులలో జైలు శిక్ష విధించిందని పేర్కొన్నారు. గత ఏడాది బెయిల్ మీద వచ్చి మల్లాపూర్ మండలం ముత్యంపేట, సిర్పూర్, మేడిపల్లి మండలం దమ్మన్నపేట గ్రామలలో చోరీ పాల్పడ్డాడని తెలిపారు. మంగళవారం సాయంత్రం మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామ శివారులోని చక్కెర ఫ్యాక్టరీ వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా లక్ష్మణ్ అను మానస్పదంగా కనిపించగా అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. దీంతో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు నేరం ఒప్పుకోవడంతో అతని వద్ద నుంచి 103 గ్రాములు బంగారం, 125 గ్రాముల వెండి, ఒక బైక్‌స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిందితుడిపై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. దొంగను పట్టుకోవడంలో చాకచాక్యం వ్యవహరించిన మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డిని, మల్లాపూర్ ఎస్‌ఐ రాజులు, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, డీఎస్పీ రాములు అభినందించారు.

వృత్తి కూలి పని.. ప్రవృత్తి గంజాయి సాగు

● సిరిసిల్ల మెడికల్ కళాశాల నిర్మాణ ప్రదేశంలో గంజాయి మొక్కల పెంపకం

● ఒడిశా, పశ్చిమ బెంగాల్ వలస కూలీల గుట్టురట్టు చేసిన పోలీసులు

● జిల్లా వ్యాప్తంగా ఏడాదిలో 2.2 కిలోల గంజాయి సీజ్.. 48 మంది అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లకు వలస వచ్చిన ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన ఆరుగురు పని చేసే ప్రదేశంలోనే గంజాయి సాగు చేశారు. వారిని వారంరోజుల క్రితం పోలీసులు పట్టుకున్నారు. జిల్లావ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు చేశారు. నార్కోటిక్ జాగిలాలతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఏడాదిలో గంజాయి అక్రమ రవాణా, సాగుచేస్తున్న, తాగుతున్న 48మందిని అరెస్ట్ చేశారు. వారినుంచి 2.2కిలోల గ్రాముల గంజాయిని పోలీసులు సీజ్ చేశారు.


వలసకూలీలు సాగు చేసిన గంజాయి మొక్కలు(ఫైల్)

● గంజాయి సాగులో కొత్తకోణం..

గంజాయి సాగులో కొత్త కోణం వెలుగు చూసింది. తమపై ఎవరి దృష్టిపడదని భావించిన వలస కూలీలు సిరిసిల్ల మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులు చేస్తూ అక్కడే గంజాయి మొక్కల పెంపకం చేపట్టారు. విషయం తెలుసుకున్న సిరిసిల్ల పోలీసులు ఈ వ్యవహారాన్ని గుట్టురట్టు చేశారు. సిరిసిల్ల పట్టణం బైపాస్ రోడ్డులో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు జరుగు తున్నాయి. ఒడిశా రాష్ట్రానికి చెందిన దేబ్రట్ ధాలి, మాలే మాలిక్ సెంట్రింగ్ పని చేసు కుంటూ పక్కనే షెడ్డులో ఉంటున్నారు. పక్కనే ఉన్న భూమిలో గంజాయి విత్తనాలు చల్లి మొక్కల పెంపకం చేపట్టారు. పెరిగిన ఆకులను తెంపి ఎండబెట్టి గంజాయిని తయారుచేస్తున్నారు.

● ఆరుగురు కటకటాలపాలు

గంజాయి సాగుచేస్తూ, సేవిస్తున్న ఆరుగురు వలస కూలీలు కటకటాలపాలయ్యారు. ఒడిశాకు చెందిన దేబ్రట్ ధాలి, మాలే మాలిక్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రణబ్ సింహా, సాగర్ సర్కార్, జిబాన్ బిశ్వాస్, రంజీవ్ సింహాను పోలీసులు అరెస్టు చేశారు. దాదాపు 5.2 లక్షల రూపాయల విలువైన 52గంజాయి మొక్కలను తొలగించి ధ్వంసం చేశారు. ఆరుగురు వలసకూలీలను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపి 50గ్రాముల ఎండిన గంజాయి, రెండు గంజాయి తాగే పైపులను పోలీసులు సీజ్ చేశారు. ఈ విషయం సిరిసిల్లలో చర్చనీయాంశమైంది.



● గంజాయి రవాణాపై ఉక్కుపాదం

- అఖిల్ మహజన్, ఎస్పీ

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాం. గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలో స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తూ నార్కోటిక్ జాగిలాలతో తనిఖీలు చేస్తూ గంజాయి అక్రమ రవాణాను అరికడుతున్నాం. గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్నవారిపై నిఘా పెట్టి గంజాయి కిట్ల సహాయంతో యూరిన్ టెస్ట్‌లు నిర్వహించి సేవించే వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తున్నాం. గంజాయికి అలవాటు పడిన వారికి డీఅడిక్షన్ సెంటర్‌లో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నాం. గంజాయి విక్రయించినా, సాగు చేసినా, రవాణా చేసినట్లు తెలిస్తే వెంటనే 8712656392 నంబర్‌కు సమాచారం అందిస్తే కఠినచర్యలు తీసుకుంటాం.

దాడికి పాల్పడిన భార్యాభర్తలపై కేసు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇంటిపక్కన గోడ విషయంలో దాడికిదిగి గాయపరిచిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్ గ్రామానికి చెందిన భార్యభర్తలు భీమరి రేణ, నర్సింలుపై కేసు నమోదుచేశామని ఎస్సై రమాకాంత్ బుధవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామంలోని భీమరి అంజయ్య తన ఇంటిస్థలంలో పక్కనే ఉన్న సోదరుడు నర్సింలు ఇల్లు కనిపించకుండా గోడను నిర్మించాడు. అడ్డుగా ఉన్న గోడను నర్సింలు తొలగించడంతో ఈనెల 18న ఇదేమిటని అంజయ్య ప్రశ్నించాడు. దాంతో కోపోద్రిక్తుడైన నర్సింలు తన ఇంటిలోని కొడవలిని తీసుకొని వచ్చి అంజయ్యపై దాడికి దిగాడు. అడ్డుగా వెళ్లిన అంజయ్య భార్య మనెవ్వ, కొడుకు అభిలాష్‌లను రోకలిబండతో దాడిచేశాడు. ఈ క్రమంలో నర్సింలు, అతని భార్య రేణ అసభ్యపదజాలంతో దూషిస్తూ విచక్షణారహితంగా చితకబాదారు. బాధితుడు అభిలాష్ ఫిర్యాదు మేరకు భార్యాభర్తలు రేణ, నర్సింలుపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై రమాకాంత్ వివరించారు.

అసత్య ప్రచారం చేసిన యువకుడిపై..

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అధికారులపై అసత్య ప్రచారంచేసిన కందికట్కూర్ గ్రామానికి చెందిన తాళ్ళపల్లి శశిధర్‌గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ వాట్సాప్ గ్రూపులో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా, పోలీసు అధికారులతో పరిచయాలు ఉన్నాయంటూ ప్రచారం చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రజలను రెచ్చగొట్టే విధంగా ఎవరు తప్పుడు ప్రచారం చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అధికారులను కించపరిచే పోస్టులు పెట్టిన ఇద్దరిపై..

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా అధికారులను కించపరిచే విధంగా సోషల్‌మీడియా వేదికగా పోస్టులు చేసిన గుండారపు గణేశ్, ఆకుల శ్రీనివాస్‌రెడ్డిలపై బుధవారం కేసులు నమోదు చేశామని సిరిసిల్ల టౌన్‌సీఐ కె కృష్ణ తెలిపారు. వీరితో పాటు మరికొందరిపై కేసులు నమోదు చేస్తామన్నారు. జిల్లా అధికారుల గురించి, వారి వ్యక్తిగత విషయాలకు సంబంధించిన అసభ్యకర పోస్టులు పెడితే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. అధికారులు, ఇతరులను కించపరిచే విధంగా, మనోభావాలు దెబ్బతినే విధంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేసిన వారిపై, గ్రూప్ అడ్మిన్‌లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

ద్విచక్ర వాహనాలు, సైకిళ్లు దగ్ధం

మల్లాపూర్, ఫిబ్రవరి, 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్టాపూర్‌గ్రామంలోని ఓ మెకానిక్ షెడ్‌లో రెండు బైక్‌లు, పలుసైకిళ్లు దగ్ధమైనట్లు బుధవారం గ్రామ స్థులు తెలిపారు. వారికథనం ప్రకారం గ్రామంలోని మెకానిక్‌షెడ్డు వద్ద మరమ్మతుల నిమిత్తం ఉన్న వాహనాలు, సైకిళ్లు కాలిపోయాన్నారు. ఏదైనాప్రమాదం జరిగిందా లేకఎవరైనా చేశారా అనే అనుమానాలను వ్యక్తం చేశారు.

12 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

ముస్తాబాద్, ఫిబ్రవరి 19(ఫిబ్రవరి):మండలంలోని మొర్రాయిపల్లెశివారులో 12 క్వింటాళ్లరేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిపారు. ముస్తాబాద్‌కు చెందిన ఆనరాశి శేఖర్, గంధ సత్యనారాయణ గ్రామాలలో తిరుగుతూ సేకరించిన పీడీఎస్ బియ్యాన్ని అధికధరకు డొక్క ప్రవీణ్‌కు అమ్మడానికి నిర్ణయించారన్నారు. మొర్రాయిపల్లె శివారులో నిల్వఉంచిన పీడీఎస్ బియ్యాన్ని ద్విచక్రవాహనంపై తరలిస్తుండగాపట్టుకున్నట్లు తెలిపారు. బియ్యం స్వాదీనంచేసు కొని కేసు దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

శంకరపట్నం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కొత్తగట్టు శివారులో కరీంనగర్-వరంగల్ జాతీయరహదారిపై బుధవారం రాత్రి లారీ, బైక్ ఢీకొన్నఘటనలో ఓయువకుడు దుర్మరణం చెందాడు. స్థానికుల సమాచారం మేరకు.. వీణవంక మండలం బేతిగల్ గ్రామానికి చెందిన ముద్దమల్ల హరీన్(23) లారీ బైక్ ఢీ కొన్న ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ కొత్తపల్లి రవి సంఘటన స్థలానికి చేరుకొని మృతికి సంబంధించి వివరాల సేకరిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

గొల్లపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండల కేంద్రంలోని నల్లగుట్ట సమీపంలోని సర్వే నెం.544లోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా మట్టి తవ్వడమే కాకుండా, అడ్డుకోవడానికి వచ్చిన రెవెన్యూ అధికారుల విధులకు ఆటంకం కల్గించిన ఒడ్డె రవి అనే వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిర్ర సతీష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రవిపై కేసు నమోదు చేశామన్నారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

లింగంపేటలో 2500 కోళ్లు మృతి

● ఆలస్యంగా వెలుగులోకి


ట్రాక్టర్‌లో మృతి చెందిన కోళ్లు(ఫైల్)

చందుర్తి, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగంపేటలో అంతుచిక్కని వ్యాధితో 2500 కోళ్లు మృత్యువాత పడ్డాయి. వారం రోజుల క్రితం ఈ సంఘటన జరగగా, ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామంలో రమేష్‌రావుకు చెందిన పౌల్ట్రీఫామ్‌లో వారంక్రితం మూడు రోజుల్లో 2500 కోళ్లు మృత్యువాతపడ్డాయి. దీంతో వాటిని ట్రాక్టర్‌లో గ్రామానికి దూరంగా తీసుకెళ్లి గోతి తీసి పూడ్చివేశాన ని, కోళ్ల మృతితో నాలుగు లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లినట్లు రైతు రమేష్‌రావు వాపోయాడు. కాగా, గురువారం గ్రామాన్ని సందర్శించి శాంపిల్స్ సేకరించనున్నట్లు మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారి శ్రీధర్ తెలిపారు.

క్రీడారంగంలో నంబర్‌వన్‌గా నిలుపుతాం

● తెలంగాణ ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి



మాట్లాడుతున్న పి మల్లారెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రీడలను ప్రమోట్ చేసేందుకు ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో ఏటా స్పోర్ట్స్ ఒలింపియాడ్ నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నామని, క్రీడా రంగంలో తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిపేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్రఒలింపిక్ సంఘం ప్రధానకార్యదర్శి పి మల్లారెడ్డి అన్నారు. బుధవారం కరీంనగర్‌లో నిర్వహించిన తెలంగాణ జూడో అసోసియేషన్ సమావేశానికి హాజరయ్యారు. అంతకుముందు విలేకరులతో మాట్లాడారు. ఒలింపిక్ సంఘంలో గుర్తింపు ఉన్న సంఘాలకు మాత్రమే ప్రాతినిధ్యం ఉంటుందని, అక్రమపద్ధతుల్లో ఏర్పడే సంఘాలకు మనుగడ లేదని అన్నారు. ఇటీవల ఒలింపిక్ సంఘం నూతన కార్యవర్గం ఏర్పటైందని, ఏర్పాటైన కొద్ది నెలల్లోనే తెలంగాణలో ఎన్నో మార్పులు తీసుకొచ్చామని తెలిపారు. ఉత్తరాఖండ్‌లో జరిగిన 38వ జాతీయ క్రీడల సందర్భంగా తెలంగాణ అథ్లెట్లకు డీఏ రూ.250 నుంచి రూ.500 పెంచేలా కృషిచేసినట్లు చెప్పారు. పతకాలు సాధించిన క్రీడాకారులకు గతంలో వరుసగా రూ.5లక్షలు, రూ.3లక్షలు ఇవ్వగా, ఈ సంవత్సరం నుంచి రూ.10లక్షలు, రూ.7లక్షలు, రూ.5లక్షలు ఇచ్చేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. 2026లో తెలంగాణలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణకు తెలంగాణ ఒలింపిక్ సంఘం కృషి చేసినట్లు చెప్పారు. క్రీడాసంఘాల మధ్య ఏర్పడుతున్న విభేదాలను పరిశీలించనున్నామని, అన్ని క్రీడాసంఘాలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ యూనివర్సిటీతోపాటు క్రీడలకు 370కోట్ల రూపాయలు కేటాయించడం అభినందనీయమన్నారు.

తెలంగాణలో జూడో క్రీడాభివృద్ధికి కృషి

● శాసనమండలి డిప్యూటీచైర్మన్, తెలంగాణ జూడో సంఘం చైర్మన్ బండ ప్రకాశ్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర జూడో సంఘం చైర్మన్ బండ ప్రకాశ్

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణ వ్యాప్తంగా జూడో క్రీడాభివృద్ధికి కృషి చేస్తానని శాసనమండలి డిప్యూటీ చైర్మన్, తెలంగాణ జూడో అసోసియేషన్ చైర్మన్ బండ ప్రకాశ్ అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని హోటల్ మైత్రీలో తెలంగాణ జూడో అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో జూడో క్రీడాకారులకు కొదవలేదని, భవిష్యత్‌లో ఒలంపిక్‌స్థాయికి ఎదగాలన్నారు. 38వజాతీయస్థాయి క్రీడల్లో తెలంగాణ జూడోక్రీడకారులు అద్వితీయ ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. ప్రతీ ఒక్కరు జూడోలో శిక్షణ తీసుకోవాలన్నారు. తెలంగాణ జూడో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బండ రాజ్‌కుమార్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ జూడో క్రీడకు సంబంధించి త్వరలోనే అకాడమీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.జూడో అసోసియేషన్ కోశాధికారి మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● తెలంగాణ రాష్ట్ర జూడో అసోసియేషన్ ఎన్నిక

తెలంగాణ రాష్ట్ర జూడో అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా వరంగల్ జిల్లాకు చెందిన బండ రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కరీంనగర్‌కు చెందిన గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా కడారి అనంతరెడ్డి (కరీంనగర్), పబ్బతి బాలరాజు(యాదాద్రి భువనగిరి), బాదినేని రాజేందర్‌రెడ్డి(జగిత్యాల), మాటేటి సంజీవ్‌కుమార్(పెద్దపల్లి), సంయుక్త కార్యదర్శులుగా రాయిరెడ్డి శంకర్‌రెడ్డి(సిద్దిపేట), సిలివేరి మహేందర్(పెద్దపల్లి), తిప్పారపు సత్యనారాయణ (రాజన్న సిరిసిల్ల), చందనగిరి నాగరాజు(వరంగల్), కోశాధికారిగా రాయిరెడ్డి మహేందర్ రెడ్డి(సిద్ధిపేట), కార్యవర్గ సభ్యులుగా ఎ సాయిచరణ్(ఆదిలాబాద్), వైసాయి కిరణ్(నిర్మల్), కెతిరుపతిగౌడ్(రాజన్నసిరిసిల్ల), కెరాకేష్ (ఆసిఫాబాద్), ఎ రమేశ్‌రెడ్డి(మంచిర్యాల), ఎం శ్రీనివాస్(జగిత్యాల) ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంతో తెలంగాణ జూడో సంఘానికి చైర్మన్‌గా తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి జాయ్ వర్గీస్ కె, తెలంగాణ ఒలంపిక్ సంఘం నుంచి పి.మల్లారెడ్డి, తెలంగాణ రాష్ట్ర క్రీడాప్రాధికారిక సంస్థ నుంచి వి.శ్రీనివాస్ ఎన్నికల పరిశీలకులుగా హాజరయ్యారు. నూతన కార్యవర్గం నాలుగేళ్లపాటు పనిచేస్తుందని ఎన్నికల అధికారి ఎస్.పరమేశ్వర్ ప్రకటించారు.



బీజేపీకి సవాల్..

● పట్టభద్రులు, ఉపాధ్యాయ స్థానాల్లో గట్టి పోటీ
● కేంద్రమంత్రి సంజయ్ సారథ్యంలో ప్రయత్నాలు
● ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ఎనిమిది మంది ఎంపీలు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలను గెలిపించుకున్న బీజేపీ వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి రాష్ట్రంలో అధికారం కైవసం చేసుకోవాలని ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నది. రాష్ట్రంలో జరుగుతున్న కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలు, ఉపాధ్యాయ స్థానం గెలుచుకోవడం ద్వారా రాష్ట్రంలోని విద్యావంతులందరూ బీజేపీ వైపే చూస్తున్నారని సంకేతాలివ్వడానికి తహతహలాడుతోంది. బీజేపీకి చెందిన ఏడుగురు ఎమ్మెల్యేలు, నలుగురు ఎంపీలు కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో గెలిచినవారే కావడంతో ఈ రెండు స్థానాలను గెలుచుకోవడం ఆ పార్టీకి అత్యంత అవసరంగా మారింది. ఈ ప్రాంతంలో తమకు ఆదరణ ఉందని నిరూపించుకోవడానికి ఈ ఎన్నికల విజయం దోహదపడుతుందని భావిస్తున్నారు. లేకపోతే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో దీని ప్రభావం ఉంటుందని ఆ పార్టీ భావిస్తున్నది. ఈ కారణంగా ఈ పట్టభద్రుల, ఉపాధ్యాయ స్థానాలలో గెలుపును సవాల్‌గా తీసుకుంటున్నది.

50 మంది ఓటర్లుకు ఒక బాధ్యుడు



కాంగ్రెస్‌పార్టీ కంటే ముందుగానే అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ ప్రచారంలో కొంత వెనుకబడినా ఇప్పుడిప్పుడే క్షేత్ర స్థాయిలో ప్రత్యేక కార్యాచరణతో కదులుతోంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో చిన్న మైల్ అంజిరెడ్డిని, ఉపాధ్యాయ స్థానంలో మల్క కొమురయ్యను అభ్యర్థులుగా రంగంలోకి దింపింది. కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్, ఎంపీలు ధర్మపురి అరవింద్, రఘునందన్ రావు, గోడెం నగేశ్, ఎమ్మెల్యేలు వెంకట రమణారెడ్డి, ధన్‌పాల్‌సింగ్, రాకేశ్‌రెడ్డి, రామారావు పటేల్, మహేశ్వర్‌రెడ్డి, పాయల్ శంకర్, డాక్టర్ హరీష్‌తో పాటు ముఖ్యనాయకులను, క్రియాశీలంగా వ్యవహరించే నేతలకు గెలుపు బాధ్యతలను అప్పగించింది. ఇప్పటికే ఆ పార్టీ శ్రేణులు నియోజకవర్గ పరిధిలో ఉన్న పట్టభద్రుల స్థానంలో, ఉపాధ్యాయ స్థానంలో ఉన్న ఓటర్లను బూత్ స్థాయిలో గుర్తించి వారి ఫోన్ నెంబర్లతో సహా వివరాలను సేకరించి నమోదు చేసుకున్నారు. 25 నుంచి 50 మంది ఓటర్లకు ఒక బాధ్యుడిని నియమించి అతని ద్వారానే ఓటు పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నది. పార్టీ ప్రచార బాధ్యతను ఓటరును సానుకూల పరిచి పోలింగ్ బూత్‌కు తీసుకువచ్చి ఓటు వేయించే బాధ్యతను ఆయా గ్రామ శ్రేణులకు అప్పగించారు.

ఆత్మీయ సమ్మేళనాలు, సోషల్ మీడియా వారియర్స్ సమావేశాలు



అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో ఇప్పటికే ఆత్మీయ సమ్మేళనాలు, సోషల్ మీడియా వారియర్స్ సమావేశాలు నిర్వహించి అనుసరించవలసిన విధానాలను వివరించారు. మండల స్థాయిలో ఓటర్ల సమావే శాలు కూడా ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచన చేస్తున్నట్లు సమా చారం. కాంగ్రెస్ పార్టీ కూడా ఓటర్లను కలువడానికి ఇదే విధానాలను అవలం బిస్తుండడంతో పోటాపోటీ వాతావరణం నెలకొంటు న్నది. కేంద్రమంత్రితోపాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిని ఆశిస్తున్న నేతలు ఈ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండడంతో ఇక్కడి గెలుపు వారందరికి సవాల్‌గా మారింది.

ప్రచారానికి దూరంగా సీనియర్లు

కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహతోపాటు 23 మంది ఎమ్మెల్యేలు కూడా పట్టభద్రుల కాంగ్రెస్ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి విజయం కోసం కృషిచేస్తున్నారు. దీంతో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు ప్రతిష్టాత్మక పోటీ సాగుతున్నదనే చర్చ జరుగుతున్నది. 2019లో జరిగిన ఎన్నికల్లో పట్టభద్రుల స్థానంలో పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి సుగుణాకర్‌రావుకు 15,077 ఓట్లు పోలయ్యాయి. ఆయన అప్పుడు మూడో స్థానంలో ఉండగా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన మాజీ మంత్రి జీవన్‌రెడ్డి 56,698 ఓట్లు సాధించి గెలుపొందారు. ఇప్పుడు ఆశావహులు పోటాపోటీగా ఓటర్ల నమోదు కార్యక్రమం చేపట్టిన ఫలితంగా 3,55,159 మంది పట్టభద్రులు ఓటర్లుగా ఉన్నారు. 27,088 మంది ఉపాధ్యాయ ఓటర్లుగా ఉన్నారు.

ఇక్కడి నుంచి బీజేపీ అభ్యర్థులుగా పోటీ చేయడానికి కరీంనగర్‌కు చెందిన కిసాన్ మోర్చా మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి పి సుగుణాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, మంచిర్యాలకు చెందిన రఘునాథ్‌రావు ప్రయత్నాలు చేశారు. పార్టీ పట్టభద్రుల అభ్యర్థిగా అంజిరెడ్డిని తెరపైకి తెచ్చింది. సుగుణాకర్‌రావు, రామకృష్ణారెడ్డి ఇప్పటి వరకు ఎక్కడా పార్టీ అభ్యర్థికి అనుకూలంగా ప్రచారంలో కనిపించడం లేదు. వారు అభ్యర్థి ఎంపిక విషయంలో అసంతృప్తితో ఉన్నారని ప్రచారం జరుగుతున్నది. కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ అభ్యర్థి గెలుపు బాధ్యతను తీసుకోవడం, పార్టీకి అనుబంధంగా ఉండే పలు విభాగాలు, సంస్థలు అంకిత భావంతో పనిచేసేతత్వంగల నాయకులు, కార్యకర్తలు ఉండడం పార్టీ ఆలోచనపరులు వేరే వారికి ఓటు వేసే అవకాశం లేక పోవడం పార్టీ అభ్యర్థికి కలిసివచ్చే అంశాలుగా నిలుస్తున్నాయి. ఉపాధ్యాయ స్థానంలో బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య ఒక్కరే రాజకీయ అభ్యర్థి కావడం గమనార్హం. మిగతావారంతా ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పోటీలో ఉన్నారు. ఈరెండు స్థానాలను పక్కాగా సాధించుకుంటామనే ధీమాతో బీజేపీ వ్యవహరిస్తుండగా, అధికార కాంగ్రెస్‌పార్టీ కూడా అంతే ధీమాను ప్రదర్శిస్తుండడం ఆసక్తికరంగా మారింది.

కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలి

● ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి



నూతన కార్యవర్గ సభ్యులతో రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): విద్యను కాషాయీకరణ, ప్రైవేటీకరణ చేసే కేంద్ర ప్రభుత్వ కుట్రలను విద్యార్థులు తిప్పికొట్టాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం కార్మికభవనంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లాస్థాయి సర్వసభ్య సమావేశం కుర్ర రాకేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి మాట్లాడారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యావిధానం, యూజీసీ ప్రతిపాదనలతో విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసే కుట్రలను విద్యార్థులు తిప్పికొట్టాలన్నారు. రాష్ట్రబడ్జెట్‌లో ప్రభుత్వం విద్యారంగ హామీల అమలుకు నిధులను కేటాయించాలని అన్నారు. తెలంగాణలో నూతన ప్రభుత్వ ఏర్పడి సంవత్సరం గడుసున్నా విద్యాశాఖ మంత్రిని కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో ఉన్న గురుకులాలకు పక్కా భవనాలు ఏర్పాటు చేయాలని, కేజీబీవీ పాఠశాలలో మౌళిక వసతులు కల్పించాలని పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నూతన కార్యవర్గంకు ఎన్నికలు జరగాయి. జిల్లా అధ్యక్షుడు కుర్ర రాకేష్, కార్యదర్శి మంద అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు పెండెల ఆదిత్య, మల్యాల శ్రీజా, పుట్టి సాత్విక్, సహాయ కార్యదర్శులు మల్లమరి జాషావా, పెంట భరత్, కే శ్రీనివాస్, 12 మంది కమిటి సభ్యులను ఎన్నుకున్నారు.

కుల గణన పేరుతో బీసీలను తగ్గించేందుకు కుట్ర

● ఉపాధ్యాయుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తోన్న కాంగ్రెస్ సర్కార్
● కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, పక్కన అభివాదం చేస్తున్న టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య, పాల్గొన్న తపస్ నాయకులు

భగత్‌నగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కుల గణన పేరుతో 60లక్షలమంది బీసీలను తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. కరీంనగర్‌లో తపస్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మెళనం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ ఫిరాయించిన పదిమంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడటం తథ్యమన్నారు. పదిసీట్లలో ఉపఎన్నికలువస్తే ఏడింటిలో బీజేపీ గెలువడం ఖాయమన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందు దొందేనని విమర్శించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలల్లో అసమ్మతి రగులుతోందని, కొందరు రహస్యంగా సమావేశాలు నిర్వహిస్తున్నారన్నారు. హిందూజాతిలో ముస్లింలను ఎలా కలుపుతారని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ముస్లింలకు నాలుగుశాతం ఇస్తేనే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీసీలు గెలువాల్సిన స్థానాల్లో ఎంఐఎం గెలిచిందన్నారు. పదిశాతం ఇస్తేపరిస్థితి ఏవిధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. తెలంగాణ కోసం కొట్లాడిన ఉద్యోగ, ఉపాధ్యాయులు జీతాలకోసం అడుక్కునే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ జీతం నుంచి దాచుకున్న జీపీఎఫ్ సొమ్మునుకూడా ఇవ్వకుండా ప్రభుత్వం వేధిస్తోందని విమర్శించారు. పీఆర్సీ సహా ఏ సమస్యనూ పరిష్కరించలేని అసమర్థ ప్రభుత్వం ఇదన్నారు. డీఏలు, జీపీఎఫ్, మెడికల్ గ్రాట్యుటి పేరిట ఉద్యోగులకు ప్రభుత్వం రూ. 8,200 కోట్ల బకాయి ఉన్నదన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ కోసం రూ.11వేల కోట్లుచెల్లించలేని దుస్థితి ప్రభుత్వాని దన్నారు. నిరుద్యోగులు, ఉద్యోగుల కోసం పోరాటం చేసింది బీజేపీ మాత్రమే అన్నారు. సమావేశంలో టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య, తపస్ నాయకులు పాల్గొన్నారు.

రాజన్న హుండీల లెక్కింపు

● 15 రోజులకు రూ.1.69 కోట్ల నగదు
● 116 గ్రాముల బంగారం, 9.80 కిలోల వెండి



డబ్బులను లెక్కిస్తున్న ఆలయ ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిహుండీలను బుధవారం లెక్కించారు. ఆలయ ఆవరణలోని ఓపెన్‌స్లాబ్‌లో ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో హుండీలను విప్పి లెక్కించారు. 15రోజుల హుండీలను లెక్కించగా రాజన్న ఖజానాకు రూ. కోటి 69లక్షల 76వేల867 నగదు, 116 గ్రాముల బంగారం, 9కిలోల 800గ్రాముల వెండి సమకూరినట్లు ఆలయ ఈవో వెల్లడించారు. ఈ హుండీ లెక్కింపులో ఏసీ కార్యాలయ పరిశీలకులు సత్యనారాయణ, ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, ఎస్పీఎఫ్ సిబ్బంది, హోమ్‌గార్డ్స్ భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. హుండీ లెక్కింపులో శ్రీశివ రామకృష్ణ భజన మండలి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



గ్రంథాలయంలో చదువుకుంటున్న పాఠకులు, విద్యార్థులు

విజ్ఞాన భాండాగారం
కేంద్ర గ్రంథాలయం

పాఠకులకు అందుబాటులో 76,785 పుస్తకాలు

విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉపయోగకరం

దిన, వార, పక్ష, మాస పత్రికలు.. 10,105 సభ్యత్వాలు

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వేసవి వస్తోంది.. మార్చి, ఏప్రిల్, మే మాసాల్లో సెలవులొస్తాయి. మధ్యాహ్నం ఎండ సమయంలో తప్ప ఉదయం, సాయంత్రం వేళల్లో సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ముఖ్యంగా విద్యార్థులు జ్ఞాన సముపార్జనకు మంచి పుస్తకాలు చదవాలి. ఇందుకోసం సమీపంలోని గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి. సెలవుల్లో విద్యార్థులతోపాటు పోటీ పరీక్షల అభ్యర్థులు, పాఠకులకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి.ఈ నేపథ్యంలో జిల్లా కేంద్ర గ్రంథాలయం, అనుబంధంగా పిల్లల గ్రంథాలయంతో పాటు 11 మండలాల్లో ఉన్న గ్రంథాలయాల్లో సభ్యత్వం పొందడం, పుస్తకాల వివరాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

పుస్తకాలు.. సభ్యులు..

జిల్లా పరిధిలో కేంద్ర గ్రంథాలయం, అందులోని చిల్డ్రన్ లైబ్రరీ, 11 మండలాల్లో కలిపి వివిధ భాషలకు చెందిన 2 లక్షల 8 వేల 399 పుస్తకాలు, ఒక్క కేంద్ర గ్రంథాలయంలో 76,785 పుస్తకాలతో పాటు దిన, వార, పక్ష, మాస పత్రికలు అందుబాటులో ఉన్నాయి. జిల్లా కేంద్రంలోనే 10,105 మంది సభ్యులుండగా 11 మండలాల్లో 5 వేల 939 మంది సభ్యులున్నారు.

సభ్యత్వం పొందడం ఇలా

ఏప్రిల్ 2024 నుంచి సభ్యత్వ రుసుము 300 రూపాయలు చేశారు. ఆ రుసుము చెల్లించి, ఆధార్ కార్డ్ జిరాక్స్ ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో అందజేస్తే జీవితకాల సభ్యత్వం పొందవచ్చు. డిజిటల్ సభ్యత్వ గుర్తింపు కార్డు కూడా ఇస్తారు. తమకు కావాల్సిన పుస్తకాలను ఇంట్లో కూడా చదువుకొని రెండు వారాల గడువులో తిరిగి గ్రంథాలయంలో అప్పగించాల్సి ఉంటుంది. పోటీ పరీక్షల పుస్తకాలు, 6 నుంచి డిగ్రీ స్థాయి వరకు పుస్తకాలు, గైడ్లను గ్రంథాలయంలోనే చదువుకోవాల్సి ఉంటుంది. ఆయా మండలాల్లో అక్కడే సభ్యత్వం పొందవచ్చు.

సమయాలు

జిల్లా కేంద్ర గ్రంథాలయం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. ప్రతి శుక్రవారం, ప్రభుత్వ సెలవు దినాల్లో లైబ్రరీ సేవలుండవు. స్టడీ అవర్స్ మాత్రం ప్రతి రోజు 24 గంటల పాటు నిర్వహిస్తారు. మండలాల్లోని గ్రంథాలయాలు ఉదయం 10-30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తాయి.

కేంద్ర గ్రంథాలయంలో అన్ని సౌకర్యాలు

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. సభ్యత్వ నమోదు, మౌలిక వసతుల కల్పన, విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులు, పాఠకుల ప్రయోజనం కోసం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, కార్యదర్శి సరితతో పాటు సిబ్బంది ప్రత్యేక చొరవ కనబరుస్తున్నారు. పోటీ పరీక్షల అభ్యర్థుల రిలాక్స్ కోసం ప్రతి రోజూ చైర్మన్ తన సొంత ఖర్చులతో తేనీరు అందిస్తున్నారు. సభ్యులకు డిజిటల్ కార్డులను మంజూరు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు కొత్తగా వస్తున్న పుస్తకాలను తెప్పిస్తున్నారు. డీసీఎల్‌లో ఇంటర్‌నెట్, వైఫై సదుపాయం ఉంది. ఒక నెలలో డీసీఎల్‌లో ఉన్న పుస్తకాల పేర్లు, సంఖ్య వివరాలు బార్‌కోడ్‌తో సహ డాటాలో ఎంట్రీ చేయనున్నారు. మెంబర్‌షిప్ కార్డులను కూడా సిస్టంలో డిజిటలైజేషన్ పూర్తి చేస్తున్నారు.



కరీంనగర్ గ్రంథాలయ ముఖ ద్వారం

మహాశివరాత్రి జాతరకు ముమ్మర ఏర్పాట్లు

● ఆలయ ఆవరణలో వేగంగా జరుగుతున్న పనులు
● ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న అధికారులు





ఆలయ గుడి చెరువులో శివార్చన వేదిక వద్ద ఏర్పాట్లను చేస్తున్న సిబ్బంది, (ఇన్‌సెట్లో) ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్న సూచికలు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి జాతరకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. మరోనాలుగు రోజులు మాత్రమే మిగిలివుండటంతో జాతరఏర్పాట్లను అధికారులు వేగవంతంగా చేస్తున్నారు. రాజన్న ఆలయానికి మహాశివరాత్రి జాతరను పురస్కరించుకుని సుమారు నాలుగులక్షల మంది వరకు భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ గడిచెరువులో భక్తులను అలరించేందుకు సుమారు 800మంది కళాకారులతో ప్రదర్శన నిర్వహించేందుకు శివార్చన వేదికను ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు వీక్షించేందుకు చలువ పందిళ్లను భారీగా ఏర్పాటుచేసి ఎక్కడ కూడా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా బారికేడ్స్, పోలీస్‌సిబ్బందిని ఏర్పాటు చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నారు. రాజన్నఆలయ ఈవో వినోద్‌రెడ్డి, ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, శ్రావణ్ కుమార్, డీఈ రఘునందన్‌లు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. వాహనాల్లో జాతరకు వచ్చేభక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు పట్టణశివారు నుంచి వీఐపీ, వీవీఐపీ పార్కింగ్ స్థలం గుర్తించేలా సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తూ, పట్టణ మ్యాప్‌నుసైతం ఫ్లెక్సీల రూపంలో భక్తులకుఅందుబాటులోకి తీసుకవస్తున్నారు. ప్రధానకూడళ్లవద్ద ఫ్లెక్సీలుఏర్పాటు చేయడంతో భక్తులు సులువుగా పార్కింగ్‌స్థలాలకు చేరుకునేలా సిద్ధం చేస్తున్నారు. రాజన్న ఆలయంలోని గోపురాలకు, విద్యుత్ దీపాలు, పార్కింగ్ ఏరియా, సైన్‌బోర్డ్స్ఏర్పాటు చేస్తున్నారు.

ఉపాధి కూలీలకు వడదెబ్బ తగలకుండా చర్యలు

- ఈజీఎస్ ఏపీవో కొమురయ్య



ఆంధ్రజ్యోతి : గ్రామాల్లో ఈజీఎస్‌లో ఏయే పనులు చేపడుతున్నారు?

ఏపీవో : మండలంలోని 24 గ్రామాల్లో రైతులు, ప్రజలకు అవసరాలకనుగుణంగా ఉపాధిహామీ పథకం కింద పనులను చేపడుతున్నాం. భూఅభివృద్ధి, పూడికతీత, నీటి నిల్వలు, పంటకాల్వలు, చిన్ననీటి కుంటలు, మొక్కల పెంపకం, పాడి గేదెల షెడ్లు, తోటల పెంపకం తదితర పనులను చేపట్టి కూలీలకు పని కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : మండలంలో ఎంత మంది కూలీలకు ఉపాధి పనులు కల్పిస్తున్నారు?

ఏపీవో : మొత్తం 12,234 మందికి జాబ్ కార్డులు అందించాం. నిత్యం 6 వేల మంది ఉపాధి పనులు చేస్తున్నారు. పనికి వచ్చేలా అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : ఎండకాలంలో పని ప్రదేశంలో ఎలాంటి ఏర్పాటు చేస్తున్నారు?

ఏపీవో : అన్ని గ్రామాల్లో ఎండకాలంలో కూలీలు పనులు చేసే ప్రదేశాల్లో చలువ పందిర్లు ఏర్పాటు చేయడంతో పాటు తాగు నీటి సౌకర్యం, పీహెచ్‌సీల సహకారంతో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ప్రాథమిక చికిత్స అందించేందుకు కిట్లను అందుబాటులో ఉంచుతున్నాం. ఉదయం 9గంటల వరకే పనులు ముగించేలా చర్యలు తీసుకోనున్నాం.

- ఎల్లారెడ్డిపేట (ఆంధ్రజ్యోతి)

చంద్రంపేటలో లోపించిన పారిశుధ్యం

- రోడ్డుపై పారుతున్న మురుగునీరు - ఇబ్బందులు పడుతున్న ప్రజలు - పట్టించుకోని మున్సిపల్ అధికారులు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల మున్సిపాలిటీలో విలీనమైన చంద్రంపేట గ్రామంలో పారిశుధ్యం లోపించింది. మురుగునీరు రోడ్లపై పారుతుండడంతో దుర్గంధంతో పాటు దోమలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలో ఉన్న చంద్రంపేట గ్రామాన్ని మున్సిపాల్టీలో విలీనం చేసి వార్డుగా మార్చారు. అయితే నాటి గ్రామపంచాయతీ హయాంలో ఉన్న సిబ్బందితోనే పనులు చేయిస్తున్నారు. గ్రామం వార్డుగా మారిపోవడంతో చంద్రంపేటలో నివాసాలు పెరిగిపోగా పారిశుధ్య సిబ్బంది లేకపోవడంతో అపరిశుభ్రత పెరిగిపోయింది. వార్డులో సరిగా మురుగు కాలువలు లేకపోవడంతో మురుగునీరంతా ఇళ్ల మధ్యలో నిండిపోతోంది. మరికొన్నిచోట్ల రోడ్డు పక్కనే పారుతుండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీనికితోడు దోమలు పెరిగిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం చలితీవ్రతకు తోడు దోమలు అధికంగా పెరిగిపోవడంతో ప్రజలు జర్వాలతో అల్లడిపోతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దోమల నివారణ కోసం మున్సిపల్ అధికారులు కొనుగోలు చేసిన ఫాగింగ్ మిషన్‌ను కార్యాలయానికి మాత్రమే పరిమితం చేశారని, ఎప్పుడు కూడా విలీనం చేసిన గ్రామాల్లో తిప్పలేదని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి చంద్రంపేట వార్డులో పర్యటించి పరిస్థితులను పరిశీలించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకునేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



చంద్రంపేటలో రోడ్డు పక్కనే పారుతున్న మురుగునీరు, పేరుకుపోయిన చెత్తాచెదారం

దుర్గంధంతో ఇబ్బందులు..

- వీరగోని శ్రీనివాస్‌గౌడ్, చంద్రంపేట



చంద్రంపేట గ్రామంలో సరైన మురికి కాలువలు సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు ఇళ్ల మధ్యలోనే నిలిచిపోవడంతో ప్రజలు దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై పలుసార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసిన ఎవరు పట్టించుకోకపోవడంతో ప్రజలందరు ఇబ్బందులు పడుతున్నారు.

24న నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలి : సీఐటీయూ

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని ఈనెల 24న పాలిస్టర్ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘ భవనం ఎదుట కార్మికులతో చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని నేహ్రూనగర్‌లోని భవాని ఫంక్షన్ హాల్‌లో బుధవారం మరమగ్గాల కార్మికులతో జరిగిన సమావేశంలో నెహ్రూనగర్, వెంకట్రావునగర్ ఏరియాలకు సంబంధించి 11 మందితో నూతన కమిటీని ఎన్నుకోవడంతోపాటు ఈనెల 24న చేపట్టే ధర్నాపై చర్చించారు.

నెహ్రూనగర్ కమిటీ ఎన్నిక

పట్టణంలోని నేహ్రూనగర్ ఏరియా సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ వార్డు గౌరవ అధ్యక్షుడిగా సందుపట్ల రామచంద్రం, అధ్యక్షుడిగా బెజుగం సురేష్, కార్యదర్శిగా స్వర్గం చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా అన్నల్‌దాస్ రాములు, మేర్గు నరేష్, సహాయ కార్యదర్శులుగా సబ్బని కృష్ణ, కళ్యాణపు మహేందర్, కమిటి సభ్యులుగా మ్యాన శ్రీనివాస్, కూరపాటి రాజు, కోమాకుల సురేష్, ఎండి అంకుష్‌లను ఏకగ్రీవం ఎన్నుకున్నారు. ఈ సమావేశాలల్లో జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, జిల్లా నాయకులు జిందం కమలాకర్ పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో విద్యను అభ్యసించాలి..

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

వేములవాడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో విద్యనభ్యసించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. వేములవాడ పురపాలక సంఘం పరిధిలోని సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాన్ని కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంటగది, స్టోర్ రూమ్, డార్మెటరీ, తరగతి గదులు, మెనూ చార్ట్ పరిశీలించి, ఆహార పదార్థాలు పరిశీలించారు. సిలబస్ వివరాలను వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శాత్రాజుపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల, అంగన్వాడీలో మధ్యాహ్న భోజనంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి అనువైన స్థలాన్ని గుర్తించాలని రెవెన్యూ, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహేష్ కుమార్, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తదితరులు ఉన్నారు.

ముందస్తు అనుమతి ఉంటేనే ఇసుక తరలించాలి..

ముందస్తు అనుమతి ఉంటేనే ఇసుకను తరలించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. వేములవాడ పట్టణంలో ఇసుక తరలిస్తున్న వాహనాలను బుధవారం నాడు ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సదరు వాహనానికి సంబంధించిన వే బిల్లు, డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్ ఇతర పత్రాలను పరిశీలించారు. అన్ని అనుమతులు పొందిన తర్వాత ఆయా పత్రాలను వెంట పెట్టుకొని సంబంధిత ఇసుక రీచ్ నుంచి మాత్రమే ఇసుకను తరలించాలని సూచించారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలించే వాహనాలను వెంటనే సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ మహేష్, కమిషనర్ అన్వేష్ కలెక్టర్ వెంట ఉన్నారు.



గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో వంటశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

'ట్రస్టు బోర్డు' కోసం ఎదురుచూపులు

(5వ పేజీ తరువాయి)

ఆరోపణలు ఉన్నా యి. రాష్ట్రంలోని ఆలయాలకు ధర్మకర్తల మండలిని నియమిస్తామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆరు నెలల క్రితం దేవాలయాల అభివృద్ధికి సంబంధించిన సమీక్ష సమావేశంలో ప్రకటించడంతో ఆశావహుల్లో కొత్త ఆశలు మొదలైనా ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. మార్కెట్ కమిటీలకు నామినేట్ కమిటీలు వేసిన సందర్భంలో వేములవాడ దేవస్థానం ఛైర్మన్, డైరెక్టర్ల పదవుల కోసం పలువురు కాంగ్రెస్ నాయకులు ఆసక్తి చూపినా దేవస్థానం కమిటీ ఊసే లేకపోవడంతో నిరాశతోనే ఉన్నారు.

12 ఏళ్లుగా ఉత్సవ కమిటీలే..

రాష్ట్రంలో అతి పెద్ద దేవాలయాల్లో వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ముందు వరుసలోనే ఉంటుంది. మహాశివరాత్రి, శ్రీరామనవమి వేడుకలు, శివకల్యాణోత్సవాలు.. ఇలా అనేక వేడుకలు దేవాల యంలో ప్రధానంగా జరుగుతుంటాయి. దేవస్థానానికి తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, గుజ రాత్, ఛత్తీస్‌గఢ్ లాంటి రాష్ట్రాల నుంచి భక్తులు ఎక్కు వగా వస్తుంటారు. ప్రధానంగా.. మహాశివరాత్రికి లక్షలాది మంది భక్తులు తరలివస్తుంటారు. మహా శివరాత్రి సమయంలో మాత్రం ఉత్సవ కమిటీలను నియమించి వేడుకలు నిర్వహిస్తున్నారు. ఉత్సవ కమిటీ లను నియమించినా వారి ప్రమేయం నామామాత్రం గానే ఉంటుంది. అధికార యంత్రాంగం పెత్తనమే కొనసాగుతుంది. భక్తులకు అందించాల్సిన సేవలపై పట్టించుకోవడం లేదనే విమర్శలు కూడా ఉంటాయి. వేములవాడ దేవస్థానానికి 1963 నుంచి ట్రస్ట్‌బోర్డు నియామకాలు జరుగుతూ వస్తున్నాయి. 2009-2013 వరకు మాజీ ఎమ్మెల్యే బొమ్మ వెంకన్న ఛైర్మన్‌గా కొన సాగిన తరువాత పాలకవర్గాల ఊసే మర్చిపోయారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో వేములవాడ దేవస్థానం అభివృద్ధి కోసం వీటీఏడీఏను 2016లో ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి ఛైర్మన్‌గా, సీనియర్ ఐఏఎస్ అధికారిని వైస్‌ఛైర్మన్‌గా నియమించినా హైద రాబాద్ నుంచే కార్యకలాపాలు కొనసాగించారు. గత సంవత్సరం వీటీడీఏను వేములవాడకు తరలించారు. పరిధిని కూడా ఇటీవల జిల్లా వ్యాప్తం చేశారు. ప్రభు త్వ విప్ ఆది శ్రీనివాస్ దేవస్థానం అభివృద్ధి పైనే దృష్టి పెట్టారు. గత బడ్జెట్‌లో రూ.50 కోట్లు కేటాయించారు. తరువాత దక్షిణ వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో అభివృద్ధికి అడుగులు పడ్డాయి. భక్తులకు సౌకర్యవంతంగా వేగంగా దర్శనం కల్పించే దిశగా చర్యలు చేపట్టారు. బ్రేక్ దర్శనం వంటి వాటికి చర్యలు చేపట్టారు. మూలవాగు మీదుగా రాజన్న ఆలయానికి చేరుకునే విధంగా ప్రభుత్వం రూ.127 కోట్ల నిధులు కేటాయించి పనుల్లో వేగం పెంచారు. కోడె మొక్కులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ గోశాలల అభివృద్ధికి రూ. 66 లక్షలు కేటాయించారు. రూ.43 లక్షలతో సీసీ ఫ్లోరింగ్, రూ.18 లక్షలతో మురికి కాలువలు, రూ. 50 లక్షలతో గోశాల షెడ్‌కు నిధులు కేటాయించారు. రూ.35 కోట్ల అంచనాలతో అన్నదాన సత్రం నిర్మాణానికి భూమిపూజ చేశారు. కానీ పాలకవర్గ నియామకాలపై స్పష్టత మాత్రం రాకపోవడంతో ఆశావహులు నిరాశగానే ఉన్నారు. ఇతర పార్టీల నుంచి నామినేట్ పోస్టుల ఆశతో కాంగ్రెస్‌లో చేరిన వారు ఉన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌తో పాటు మార్కెట్ కమిటీల పాలకవర్గాల నామినేట్ పోస్టులు వచ్చాయి. జిల్లాలో వేములవాడ దేవస్థానంతో పాటు టెక్స్‌టైల్ కార్పొరేషన్, చిన్నచిన్న దేవాలయాలతో పాటు పలు కార్పొరేషన్లకు డైరెక్టర్ల పదవులు ఎప్పుడు వస్తాయోనని ఎదురుచూస్తూ కాంగ్రెస్ పెద్దల చుట్టూ తిరుగుతున్నారు. ప్రధానంగా వేములవాడ దేవస్థానం ట్రస్ట్ బోర్డు పదవులపైనే అందరిలోనూ ఆసక్తి నెలకొంది.

సంక్షిప్త సమాచారం..

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి ఘన సన్మానం

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం సాయంత్రం బీజేపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ అధ్వర్యంలో నూతనంగా జిల్లా అధ్యక్షుడిగా నియమాకమైన రెడ్డబోయిన గోపీ ముదిరాజ్‌ను నాయకులతో కలిసి ఘనంగా సన్మానించారు. రాగుల రాజిరెడ్డి, మల్లడపేట భాస్కర్, అసాని లింగారెడ్డి, సంతోష్, సిరిసిల్ల వంశీ లతో పాటు జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా రాంప్రసాద్, కృష్ణస్వామి

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సిరిసిల్ల పట్టణానికి చెందిన సీనియర్ నాయకుడు మ్యాన రాంప్రసాద్‌ను నియమిస్తూ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు ప్రకటించారు. తన నియామకానికి కృషి చేసిన కేంద్రహోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణలకు కృతజ్ఞతలు తెలిపారు.

● వేములవాడ : బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడుగా వేములవాడ పట్టణానికి చెందిన కోలే కృష్ణస్వామి నియమితులయ్యారు. రాష్ట్ర ఎన్నికల అధికారి ఎండల లక్ష్మీనారాయణ ఒక ప్రకటన విడుదల చేశారు. నియామకానికి సహకరించిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, రేగుల మల్లికార్జున్‌లకు కృష్ణస్వామి కృతజ్ఞతలు తెలిపారు.

అనారోగ్యంతో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడి మృతి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కాసర్ల మల్లేశం(72) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతు బుధవారం మృతి చెందాడు. పట్టణ బీఆర్‌ఎస్ నాయకులు మల్లేశం మరణం పట్ల సంతాపం తెలిపారు. టీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భవించిననాటి నుండి పార్టీలో చురుకుగా పని చేస్తూ మల్లేశం కేసీఆర్ కేటీఆర్‌కు సన్నిహితంగా ఉండే వాడు. గత కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతూ పార్టీ కార్యకలాపాలలో మల్లేశం పాల్గొనడం లేదు. అనారోగ్యంతో పరిస్థితి విషమించి మల్లేశం మృతి చెందాడు.

'ప్రలోభాలకు లొంగకూడదు..'

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : బీసీ, ఎస్సీ, ఎస్టీ పట్టభద్రులు ప్రలోభాలకు లొంగకుండా ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని ధర్మ సమాజ్ పార్టీ కరీంనగర్ నియోజకవర్గం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మంద జ్యోతి అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో ధర్మ సమాజ్ పార్టీ ఎమ్మెల్సీ ధర్మయుద్ధం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ధర్మ సమాజ్‌పార్టీ జిల్లా కన్వీనర్ కేసుగాని పరమేశ్వరి జిల్లా కోకన్వీనర్ ఎడపల్లి బాబు, నాయకులు కురుమ సరేష్, వేముల వెంకట్, కాసర్ల యాదగిరి పాల్గొన్నారు.

స్థలాల పరిశీలన

కోనరావుపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు నాగారం, మామిడిపల్లి, వట్టిమల్ల, వెంకట్రావుపేట గ్రామాల్లో మార్కెట్ కమిటీ స్థలాలను కోనరావుపేట మార్కెట్ కమిటీ ఛైర్మన్ కచ్చకాయల ఎల్ల య్య బుధవారం పరిశీలించారు. మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, డైరెక్టర్లు నాయిని ప్రభాకర్ రెడ్డి, అప్పాల నాగభూషణం, లింబయ్య, మల్లారెడ్డి, ప్రభాకర్, భాస్కర్ రావు, కాంగ్రెస్ నాయకులు పల్లె రవీందర్ రెడ్డి, స్వామి, ప్రశాంత్, రవీందర్, దాదే సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

మడేలేశ్వర స్వామి కల్యాణం..

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్ట ణంలోని రజక సంఘం ఆధ్వర్యంలో శ్రీశివలింగ సహిత మడేలేశ్వరస్వామి కల్యాణ మహోత్సవానికి ప్రభుత్వ విప్‌ఆది శ్రీనివాస్ హాజరై పూజలు నిర్వహించారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అలాగే బీఆర్‌ఎస్ సీనియర్ నేత, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి స్వామిని దర్శించుకున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : మల్లారం సబ్‌స్టేషన్‌లో అదనపు బ్రేకర్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం కరీంనగర్ సీఅండ్‌వో పర్యవేక్షక ఇంజనీర్ మేకల రమేష్‌బాబు ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈలు పీ. చంద్ర మౌళి, కె.కాళిదాసు, ఏడీఈలు కిరణ్‌కుమార్, రాజా లింగం, ప్రశాంత, తిరుపతి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ సిద్దోగం

చందుర్తి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం సనుగులలో బుధవారం ఎల్లమ్మ సిద్దోగం వేడుకలు ఘనంగా జరిగాయి. వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్లో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యులు నాగం కుమార్, గౌడ సంఘం నాయకులు నాగయ్య, శ్రీనివాస్, చిరంజీవి, కుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివాజీ జయంతి వేడుకలు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలో బుధవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా హిందూ సాంస్కృతిక సమితి, భజరంగ్ దళ్, విశ్వహిందు పరిషత్‌ల ఆధ్వర్యంలో బీజేపీ, భజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు చేపూరి అశోక్, పురుషోత్తం, లింగమూర్తి, సంతోష్, క్రాంతి, రవి, అశోక్, గౌతమ్, రాజు, బీజేపీ పార్లమెంటరీ కోకన్వీనర్ అడెపు రవీందర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్ : ఏబీవీపీ పట్టణ కమిటీ అధ్వ ర్యంలో సాయిశ్రీ జూనియర్ కళాశాలలో శివాజీ చిత్రపటానికి పూలమాలలను వేసి నివాళ్లు అర్పించారు. పట్టణ కార్యదర్శి ఎనుగందుల శ్రీనివాస్, ధనూష్, రాహుల్, శ్రీనివాస్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ టౌన్ :వేములవాడ మండలంలోని చీర్లవంచ గ్రామంలో శివాజీ విగ్రహాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆవిష్కరించగా, ఆరెపల్లి, అయ్యోరుపల్లిల్లోని శివాజీ విగ్రహాలకు నివాళులు అర్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, గాలిపెల్లి స్వామి, కత్తి కనుకయ్య తదితరులు ఉన్నారు. ఆరెపల్లిలో బీఆర్‌ఎస్ నేత, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. బీజేపి మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ ఆధ్వర్యంలో శివాజీ జయంతి వేడుకులను నిర్వహించారు.

● వేములవాడ : వేములవాడ పట్టణంలో వేడుకలు నిర్వహించారు. బీజేపీ నాయకులు ప్రతాపరామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్, రేగుల మల్లికార్జున్, కోలే కృష్ణస్వామి, రేగుల సంతోష్ బాబు, పిన్నింటి హనుమాన్లు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ రూరల్ : మండలంలో వేడుకలు ఘనంగా జరిగాయి. జయవరంలోని ఛత్రపతి శివాజీ విగ్రహానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నివాళులర్పించారు. మార్కెట్ కమిటీ ఛైర్మెన్ రొండి రాజు, నాయకులు తూం మధు పాల్గొన్నారు.

●ఇల్లంతకుంట : మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో బుధవారం శివాజీ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు ఏగుర్ల శ్రీనివాస్, భజరంగ్‌దళ్ మండలఅధ్యక్షుడు ఏనుగుల శ్రీనివాస్, జిల్లా పర్యావరణ్ సంయోజక్ బత్తిని ఆంజనేయులు, మహేష్, కిషన్, నాగరాజు, మామిడి రాజు, గడ్డం రవీందర్‌రెడ్డి, నారెడ్డి కిషోర్‌రెడ్డి, సంతోష్, మ్యాకల మల్లేశం, దుద్దెడ రాజు, వంశీ, శ్రీహరి, శ్రీను, ఆంజనేయులు, జగన్, సాయిరాం, మహేందర్, హరీష్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో శోభాయాత్ర..



ఆరెపల్లిలో నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

● ముస్తాబాద్ : మండలకేంద్రంతో పాటు , పోతుగల్, గూడెం, ఆవనూర్ తదితర గ్రామాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. మెర్గు అంజాగౌడ్, ఏదూనూరి గోపి, మెంగని మనోహర్, గజ్జెల రాజు, దీటి నర్సింలు, శీలం స్వామి, రంజాని రాజలింగం, ఓరగంటి సత్యం, మెంగని మహేందర్, కృష్ణ, అజయ్ పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : మండలంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏఎంసీ ఛైర్‌పర్సన్ సబేరాబేగం, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్యలు, ప్యాక్స్ ఛైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ ఛైర్మన్ సత్తయ్య, ఏఎంసీ వైస్ ఛైర్మన్ రాంరెడ్డి, మాజీ ఎంపీపీ రేణుక, వివిధ పార్టీల నాయకులు నర్సయ్య, బాలయ్య, గణపతి, రాజయ్య, పవన్ రెడ్డి, సురేశ్, బాబు, రవి, సాహెబ్, లింగాగౌడ్, మోహన్‌రెడ్డి, కిషన్, జితేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● కోనరావుపేట : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఆర్య సంఘం, పలువురు ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

● చందుర్తి : మండల కేంద్రంతో పాటు ఎన గల్, తిమ్మాపూర్, మల్యాల, గ్రామాల్లో వేడుకలను నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్, నియోజకవర్గ కన్వీనర్ మార్త సత్తయ్య, మండల అధ్యక్షుడు మొకిలె విజేందర్, పొంచేట్టి రాకేష్, మార్త రాజు, మర్రి రమేష్, లింగాల రాజయ్య, గుగ్గిల సాగర్, చిలుముల హన్మయ్యచారి, పొంచేట్టి వెంకటేష్, రాంమోహన్ రావు, లోకోజు సతీష్, పాటి సుధాకర్, సాయికృష్ణ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి : వీర్నపల్లి మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు మాలోతు లక్పతి నాయక్ ఆధ్వర్యంలో నాయకులు శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

● గంభీరావుపేట : గంభీరావుపేట మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని బుధవారం హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శ్రీసీతారామచంద్ర స్వామి దేవాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు.

● బోయినపల్లి : బోయినపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రత్నంపేట గ్రామంలో ఆర్య క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో భారీగా నిర్వహించి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ పాల్గొని శివాజీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కందారపు వెంకటేష్, గురజాల కోటి, రాంబాబు, అశోక్, శ్రీనివాస్, కొడగాని వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని గెలిపించేందుకు బీఆర్‌ఎస్ ప్రయత్నాలు

- ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : బీజేపీని గెలిపించే ప్రయత్నం బీఆర్‌ఎస్ చేస్తోందని ఎమ్మెల్సీ, పట్టభద్రుల కరీంనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఎన్నికల జిల్లా ఇన్‌చార్జి బల్మూరి వెంకట్ అన్నారు. బుధవారంరాత్రి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గం ఇంచార్జి కేకే మహేందరెడ్డి అధ్యక్షతన సిరిసిల్ల పట్టణ స్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. సిరిసిల్ల పట్టణంలో విస్తృతంగా ప్రచారం చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని బారీ మెజార్టితో గెలిపించాలన్నారు. సమావేశంలో గ్రంథాలయం జిల్లా ఛైర్మన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటి ఛైర్మన్ వెల్ముల స్వరూపతిరపతిరెడ్డి, టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, మహిళ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, మాజీ అధ్యక్షురాలు మడుపు శ్రీదేవి, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, మార్కెట్ కమిటి డైరెక్టర్లు, మాజీ కౌన్సిలర్లు, వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : మండల కేంద్రంలో సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హమీద్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కొమిరిశెట్టి తిరుపతి, కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి గౌరీ శంకర్, పార్టీ అధికార ప్రతినిధి మల్యాల రాజవీర్ తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న బల్మూరి వెంకట్

● ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంలోని కార్యకర్తల సమావేశానికి కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ హాజరయ్యారు. ఏఎంసీ ఛైర్‌పర్సన్ సబేరా బేగం, నాయకులు నరసయ్య, రామ్‌రెడ్డి, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ బుధవారం నిర్వహించిన ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశానికి పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జ్ కేకే మహేందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ హాజరయ్యారు. పార్టీ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిటి యాదవ్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు ప్రకాష్ నాయక్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రవీందర్, సేవాదళ్ మండల అధ్యక్షుడు లక్కం బాబు, గ్రామశాఖ అధ్యక్షులు రాకేష్ గౌడ్, సీనియర్ నాయకులు కాంతయ్య, గజన్ లాల్, ఏఎంసి డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశాన్ని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ నిర్వహించారు. సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కెకె మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ తలారి రాణినర్సయ్య, పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ అంజనేయరావు, మాజీ సర్పంచ్ కలకొండ కిషన్‌రావు, జిల్లా కార్యదర్శి కొండం రాజిరెడ్డి, రాంరెడ్డి, దీటి నర్సింలు, తాళ్ల విజయ్‌రెడ్డి, కుమార్, రమణారెడ్డి, భాను, శ్రీనివాస్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి అభినందనలు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతాపార్టీ జిల్లా అధ్యక్షుడుగా నియామకం అయిన రెడ్డబోయిన గోపిని మండల నాయకులు బుధవారం కలిసి అభినందనలు తెలిపారు. మండల శాఖ అధ్యక్షుడు భూమల్ల అనీల్‌కుమార్, నాయకులు దేశెట్టి శ్రీనివాస్, చెప్యాల గంగాధర్, అశోక్‌యాదవ్ ఉన్నారు.

బియ్యం అందజేత

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన అందె మల్లయ్య కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు బుధవారం 50 కిలోల బియ్యం వితరణ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సాహెబ్, శ్రీనివాస్, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు బాబు, బాబ య్య, దేవరాజు, ఎల్లయ్య, సురేశ్, మణేశ్ పాల్గొన్నారు.

గోపాల కృష్ణ గోకలే వర్ధంతి

చందుర్తి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం సనుగుల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో శివాజీ జయంతి వేడుకలతో పాటు, గోపాలకృష్ణ గోఖలే వర్ధంతి కార్యక్రమాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ముఖేష్, ఉపాధ్యాయులు నాగమణి, హరిష్మా, నవ్యలు పాల్గొన్నారు.

ధరలను నియంత్రించాలి

కోనరావుపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : నిత్యావసర ధరలను ప్రభుత్వం నియంత్రించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జవ్వాజి విమల అన్నారు. మండలంలోని నిమ్మపల్లిలో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌పై ఉపాధి కూలీలతో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ఉపాధిహామీ చట్టానికి కేవలం 86వేల కోట్లు కేటాయించిందని, అవి సరిపోవని, రెండు లక్షల కోట్లు కేటాయించాలన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలతో చట్టబద్ధత కల్పించాలన్నారు. దేవేంద్ర, దేవలక్ష్మి, స్వరూప, నాగలక్ష్మి, విజయ, జమున, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

వీర్నపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు బాబాయి చెరువుతండా గ్రామాల అంగన్వాడీ కేంద్రాలను జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం బుధవారం తనిఖీ చేశారు. ఆయన వెంట అంగన్వాడీ టీచర్లు, ఆయాలు ఉన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

వీర్నపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడపద్దని ఎస్‌ఐ ఎల్లయ్య గౌడ్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలతో పాటు బుధవారం వాహన తనిఖీలు నిర్వహించారు. సరైన ధృవీకరణ పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించారు. హెడ్ కానిస్టేబుల్ బాబు, సిబ్బంది రియాజ్, నయిమ్, శ్రీనివాస్ లు ఉన్నారు.